సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం । 9 । జనవరి । 2024



రైల్వే కార్మికుల రిలే నిరాహార దీక్ష
రైల్వే కార్మికులకు ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అన్ని బ్రాంచ్‌ల నాయకులు రిలే దీక్షలు చేపట్టారు. - 8లో



తమాషా చేస్తున్నారా?
'తమాషా చేస్తున్నారా? విధులు సక్రమంగా నిర్వహించండి' అని ఏఈపై.. ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$28^0 / 18^0$

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి, రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

కేయూలో ఏం జరుగుతోంది?

వరుస వివాదాలతో రచ్చకెక్కుతున్న యూనివర్సిటీ

- మొన్న లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ రిజిస్ట్రార్
- నిన్న బిల్లులు రాకపోవడంతో ఓ ఉద్యోగి మనోవేదనతో మృతి
- ఆందోళనలతో అట్టుడుకుతున్నా.. మార్పేది?
- వీసీ పాలనపై విచారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్‌కు వినతులు..
- రమేశ్ పాలన సాగిస్తున్నారా లేదా అనే అనుమానాలు..
- సీఎం గారూ దృష్టి సారించరా..

- కాకతీయ యూనివర్సిటీ చరిత్రలోనే తొలిసారి ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య ఈనెల 5న లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ పాలవ్యాపారికి సంబంధించి బిల్లులు మంజూరుకు రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను మూడు విభాగాల్లో కొనసాగించడంతో ఆయనే బిల్లులు పెట్టుకుని, ఆయనే ఆడిట్ చేసే అవకాశం ఉండడంతో అవతవకలకు పాల్పడ్డారనే విమర్శలు వస్తున్నాయి.
- గతేడాది యూనివర్సిటీలో న్యాక్‌బృందం పర్యటించేకంటే ముందు వివిధ పనులను అదే యూనివర్సిటీలో సబార్డినేటర్‌గా పనిచేస్తూ.. బయట భావన డిజిటల్ షాపు నడుపుతున్న మధుసూదన్‌కు ఇచ్చారు. ఆ పనులకు సంబంధించి బిల్లులను ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయడంతో మనోవేదనకు గురై అనారోగ్యంతో గత ఆదివారం చనిపోయాడు. న్యాక్ పనులకు రూ.10కోట్లకుపైగానే ఖర్చు చేసేందుకు అప్రూవల్ కూడా తీసుకున్నారు. కానీ పనులు చేసినవారికి బిల్లుల చెల్లింపులో జాప్యం ఎందుకు చేశారని యూనివర్సిటీలో చర్చ నడుస్తోంది.

... ఇవి నాలుగు రోజుల్లోనే జరిగిన ఘటనలు.. కాకతీయ యూనివర్సిటీలో వివాదాలు సర్వసాధారణమైపోయాయి. హాస్టళ్ల నిర్వహణ నుంచి ప్రొఫెసర్ల పదోన్నతులు, సీట్ల కేటాయింపులో అవకతవకలు.. వివాదాస్పద నిర్ణయాలు. విద్యార్థి సంఘాల నిత్య ఆందోళనలతో కేయూ రోజూ వార్తల్లోకెక్కుతోంది. వీసీగా రమేశ్ రెండున్నరేళ్ల పాలన ముగిసింది. అప్పుడప్పుడు యూనివర్సిటీకి రావడం.. గెస్ట్‌హౌస్ నుంచే పాలన సాగిస్తున్నారన్న అపవాదు కూడా ఉంది. అందరికీ ఆదర్శంగా ఉండాలని, నీతులు చెప్పే విద్యాసంస్థలోనే అధికారులు అవినీతికి పాల్పడడం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

- కేయూ క్యాంపస్





విద్యార్థుల దీక్షకు టీపీసీసీ చీఫ్ హోదాలో మద్దతు తెలిపిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

కాకతీయ యూనివర్సిటీ అంతా ఆగమాగంగా మారింది. ప్రతీ విభాగంలో తిష్టవేసిన కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూనివర్సిటీ పాలన సరిగ్గా లేదని, వీసీ రెండున్నరేళ్ల పాలనపై విచారణ కమిటీ వేయాలని పలువురు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేసే వరకు వెళ్లింది. యూనివర్సిటీలోని హాస్టళ్ల డైరెక్టర్ కార్యాలయంలో కొన్నేళ్లుగా అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. అందుకు నిదర్శనం ఇటీవల అసిస్టెంట్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొంతకాలం క్రితమే హాస్టళ్ల నిర్వహణను పరిశీలించి నివేదిక ఇవ్వాలని హిస్టరీ విభాగాధిపతి మనోహర్ చైర్మన్‌గా పదిమందికిపైగా సభ్యులతో కూడిన కమిటీ నియమించారు. కమిటీ సందర్శించి అవకతవకలు జరిగాయనేది గుర్తించి ఆర్థిక లావాదేవీలపై లోతైన అధ్యయనానికి మరో విచారణ కమిటీ నియమించాలని నివేదించింది. కానీ ఆ నివేదికను యూనివర్సిటీ అధికారులు బుట్టదాఖలు చేశారు. సుమారు రూ.2కోట్లపైగానే అవకతవకలు జరిగాయని వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళన చేశాయి. అప్పటి సూపరింటెండెంట్‌పై ఆరోపణలు వచ్చినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

రిటైర్డ్ ప్రొఫెసరే రిజిస్ట్రార్

యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తూ కొంతకాలం క్రితం ఉద్యోగ విరమణ పొందిన ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌రావును మళ్లీ రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తున్నారు. వేరే ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ తాను చెప్పినట్లుగా చేస్తున్నందున ఉద్యోగ విరమణ పొందినప్పటికీ వీసీ పట్టుబట్టి మరీ పాలకమండలిలో ఆమోదింపజేసుకున్నారని మిగతా ప్రొఫెసర్లు చెబుతున్నారు. శ్రీనివాస్‌రావు కేయూ దూర విద్యాకేంద్రం డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. రిజిస్ట్రార్‌గా బిజీగా ఉండే ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించలేకపోతున్నా.. మరో రెగ్యులర్ ప్రొఫెసర్‌ను డైరెక్టర్‌గా నియమించకపోవడంలో ఆంతర్యమేంటనే చర్చ సాగుతోంది.

వివాదాల సుడిగుండంలో యూనివర్సిటీ..

- రెండున్నరేళ్లలో యూనివర్సిటీ అనేక వివాదాలకు కేంద్రబిందువైంది. 16 మంది వరకు అడ్జెంట్ ప్రొఫెసర్లను నిబంధనలకు విరుద్ధంగా నియమించారని విమర్శలు రావడంతో వారిలో ఏడుగురిని తొలగించారు. మిగతా వారిని ఎందుకు కొనసాగిస్తున్నారు.. ఏడుగురినే ఎందుకు తొలగించారనే చర్చ నడుస్తోంది.
- యూనివర్సిటీలో ఆచార్యుల కొరత ఉండడంతో వివిధ విభాగాల్లో రిటైర్డ్ ప్రొఫెసర్లను అడ్జెంట్ ప్రొఫెసర్లుగా నియమించారు. పాలకమండలి ఆమోదంతోనే నియమించుకున్నప్పటికీ యూజీసీ నిబంధనలను పాటించలేదనే ఆరోపణలున్నాయి.
- యూనివర్సిటీ భూములు కబ్జా చేశారనే ఆరోపణలతో మున్సిపల్ కార్పొరేషన్ 13 మంది ఇళ్లు నిర్మించుకున్నవారికి నోటీసులు ఇచ్చింది. అయినప్పటికీ వర్సిటీ అధికారులు వారిపై చర్యలు చేపట్టలేదు. కేయూకు అసలు భూమి ఎంత ఉంది.. ఎంత కబ్జాకు గురైంది? తదితర వివరాలతో అప్పటి పాలకమండలి సభ్యుడు డాక్టర్ నాగేంద్రబాబు కమిటీ నివేదిక వివరాలు బయటపెట్టలేదు. దాన్ని ఇప్పటివరకు కనీసం పాలకమండలి సమావేశంలో పెట్టకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- వీసీ తనకు ఇష్టంలేని ముగ్గురు, నలుగురు ప్రొఫెసర్లకు సీనియర్‌గా పదోన్నతి కల్పించలేదనే ఆరోపణలున్నాయి. కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) అధ్యక్షుడిగా ఉన్న టి.శ్రీనివాస్‌రావుకు సీనియర్ ప్రొఫెసర్‌గా, జనరల్ సెక్రటరీగా ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారికి ప్రొఫెసర్‌గా పదోన్నతులు కల్పించలేదు.
- యూనివర్సిటీ పరిధిలో కొత్తగా ఫార్మా డీ కోర్సు పెట్టిన పలు ఫార్మసీ కళాశాలలను కమిటీ వేసి తనిఖీలు చేయించారు. మరో మూడు కమిటీలు వేసి మిగిలిన కళాశాలలను తనిఖీ చేయించారని, తర్వాత అఫ్లియేషన్ ఇవ్వడం, సీట్ల పెంపుదలవంటి వాటికి భారీగా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- వివిధ సమస్యలపై ప్రశ్నించిన ఉద్యోగులు, అధ్యాపకులను బదిలీల పేరిట వణికిస్తున్నారని, ఇష్టం ఉన్నవారిని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల నుంచి క్యాంపస్‌కు బదిలీ చేయించుకుని, పరిపాలనా పదవులు కూడా కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి.
- విభాగాల అధిపతులు, డీన్‌ల నియామకాల్లో తనకు ఇష్టం ఉన్నవారిని కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. బాటనీ విభాగంలో ఇద్దరు ఆచార్యులు ఉన్నప్పటికీ కాంట్రాక్టు లెక్చరర్‌ను అధిపతిగా కొనసాగించడం, ఫార్మసీలో సోషల్ సైన్స్ డీన్‌గా ఒకే వ్యక్తిని మూడేళ్లకుపైగా కొనసాగించడం వివాదాస్పదమవుతోంది.

సీఎం దృష్టి సారిస్తారా?



గత ఏడాదిలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో విద్యార్థి సంఘాలు ఆందోళన చేయగా వీసీ.. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించారన్న ఆరోపణలతో దీక్షలు కొనసాగించారు. అప్పటి ప్రతిపక్ష నేతలు పరామర్శించి మద్దతు పలికారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా దీక్షా శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీసీ రమేశ్‌పై విచారణ కమిటీని వేయిస్తానని, పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టించడం దారుణమని వీసీ, రిజిస్ట్రార్లపై మండిపడ్డారు. తాజాగా పలువురు సీఎంకు ఫిర్యాదు కూడా చేశారు. యూనివర్సిటీ పరిస్థితిపై ఆయన ఆరా తీస్తారా? లేదా అనేది వేచి చూడాలి.

నిత్యం విద్యార్థి సంఘాల ఆందోళన

యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఆందోళనలు నిత్యకృత్యమైపోయాయి. న్యాక్‌పేరుతో మరమ్మతుల పేరుతో హాస్టళ్లు, మెస్‌లను మూసివేయించారు. దీంతో విద్యార్థులు ఆందోళన చేశారు. తరువాత కొద్దిరోజులకు తెరిపించారు. విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెట్టడం వంటివాటితో వీసీ వివాదాస్పదుడయ్యారు. అన్ని కోర్సుల ఫీజులు భారీగా పెంచారు. గత విద్యాసంవత్సరంలో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టళ్ల వసతి కల్పించలేదు. దీనిపై కూడా ఆందోళనలు జరిగాయి. మరోవైపు బాయ్స్ హాస్టల్‌ను బాలికల హాస్టల్‌గా మార్చారు. అప్పుడూ పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ విద్యాసంవత్సరంలో ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించారు. పీహెచ్‌డీ సీట్ల కేటాయింపులో పెద్ద రచ్చ జరిగింది. విద్యార్థి సంఘాల నేతల ముట్టడి, ఫర్నిచర్ ధ్వంసం, వారిని పోలీసులు కొట్టారన్న అంశాలపై చాలా రోజులపాటు దీక్షలు కొనసాగాయి.

సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదుల వెల్లువ..

యూనివర్సిటీలో వీసీ రమేశ్ పాలనపై, అనేక సమస్యలున్నాయని, అన్నింటిపై విచారణ జరిపించాలని అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మమిడాల ఇస్తారి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో పీహెచ్‌డీ సీట్ల కేటాయింపును ప్రస్తావించగా.. ఆ విషయం తన దృష్టిలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని సమాచారం. అదే విధంగా కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గాదె దయాకర్ మూడ్రోజుల క్రితం హైదరాబాద్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి యూనివర్సిటీ పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. పలు అంశాలతో కూడిన రిపోర్టును కూడా అందజేశారని సమాచారం. కాగా.. యూనివర్సిటీలో వరుస వివాదాలు, ఆయనపై వస్తున్న ఆరోపణలపై వివరణ కోరేందుకు వీసీ తాటికొండ రమేశ్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. పలు మార్లు ఫోన్ చేసినా ఆయన కాల్ అటెంప్ట్ చేయలేదు.

న్యూస్‌రీల్

ప్రజాభవన్‌గా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం



హన్మకొండ అర్బన్: శాసన సభ్యుడి అధికార నివాస గృహానికి ప్రజాభవన్‌గా పేరు పెట్టినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమారెడ్డి, కూతురు గోదారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్‌తో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించారు. అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో క్యాంపు కార్యాలయంలోకి అడుగుపెట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాయిని రాజేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా శ్రీనివాస్‌రావు



కేయూ క్యాంపస్: కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా కొనసాగుతున్న జువాలజీ విభాగం ఆచార్యులు వెంకయ్యను తప్పించి ఆయన స్థానంలో శ్రీనివాస్‌రావును నియమించారు. ఏడాది పాటు ఆయన ఆ బాధ్యతలను నిర్వర్తిస్తారు. ప్రస్తుతం శ్రీనివాస్‌రావు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

సూపరింటెండెంట్ చంద్రశేఖర్



ఎంజీఎం: ఎంజీఎంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్ కార్యాలయంలో నూతన సంవత్సరం కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఆస్పత్రిలోని రోగులకు సేవలందించే విషయంలో ఎలాంటి అవాంతరాలు వచ్చినా ఉపేక్షించమన్నారు. కార్యక్రమంలో ఎంజీఎం బ్రాంచ్ అధ్యక్షురాలు గడల ప్రేమలత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, ప్రసాద్, రాజ్యలక్ష్మి, ప్రీతి, సరళరాణి, శ్యామల పాల్గొన్నారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని పలు విభాగాల్లో పరీక్షల నిర్వహణను వీసీ తాటికొండ రమేశ్, పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వీరివెంట అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు చివరి గడువు

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో అపరాధ రుసుముతో ఈనెల 9 నుంచి 11 వరకు చివరి అవకాశం ఇస్తున్నట్లు హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి అడ్మిషన్లు పొందాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్‌ను 80084 03631 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



మొరాయించిన సర్వర్

- రాత్రి వరకు కొనసాగిన రిజిస్ట్రేషన్లు
- 121 దస్తావేజులు రూ.80 లక్షల ఆదాయం!

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సోమవారం సర్వర్ మొరాయించడంతో ఉదయం సుమారు నాలుగు గంటల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచాయి. వరంగల్ ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూ క్రయవిక్రయదారులు రాత్రి ఏడు గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వర్ మధ్యాహ్నం తిరిగి ప్రారంభం కావడంతో వరంగల్ ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 121 దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్లను రాత్రి 7 గంటల వరకు పూర్తి చేశారు. ఖజానాకు రూ.80 లక్షలు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

ఎన్నికల ఖర్చుపై స్పష్టత ఉండాలి



మాట్లాడుతున్న ఏసీ మహేందర్‌జీ

హన్మకొండ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, పార్టీలకు ఎన్నికల ఖర్చుల విషయంలో పూర్తి స్పష్టత ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో మహేందర్‌జీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే సామగ్రి, టెంట్లు, వాహనాలు, లౌడ్ స్పీకర్లు, ఫంక్షన్ హాల్స్ వంటి వాటి ధరలపై అభ్యర్థులకు, పార్టీలకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. అధికారులు ప్రసాద్‌రావు, రామకృష్ణ, పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, అమరేందర్‌రెడ్డి, రజనీకాంత్, సాయికృష్ణ, నేహల్, మణి, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

మూడు రోజులపాటు జయగిరి రైల్వేగేట్ మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట –హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య గల జయగిరి–హసన్‌పర్తికి వెళ్లే రైల్వే లెవెల్‌క్రాసింగ్ గేట్ నంబర్–6ను మూడో రైల్వే లైన్ పనుల కారణంగా మంగళవారం నుంచి గురువారం వరకు మూసివేస్తున్నట్లు కాజీపేట రైల్వే ఇంజనీరింగ్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైల్వేగేట్ నుంచి వెళ్లే వాహనదారులు, పాదచారులు వేరే మార్గం గుండా ప్రయాణించి సహకరించాలని కోరారు.

ప్రజావాణికి 60 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

హన్మకొండ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 60 వినతులు అందాయి. వీటిని స్వీకరించిన కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించారు. వినతుల పరిష్కారానికి తొలిప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

వరంగల్ ప్రజావాణిలో 58 దరఖాస్తులు

కరీమాబాద్: ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారినుంచి కలెక్టర్ ప్రావీణ్య వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 58 దరఖాస్తులు రాగా.. జీడబ్ల్యూఎంసీ 8, భూ సంబంధిత సమస్యలు 13, రెవెన్యూ 7, డీఆర్డీఓ 3, సివిల్ సప్లయీస్ 1, డీపీఓ 1 ఇతర శాఖలకు సంబంధించన దరఖాస్తులు వచ్చాయి.. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, ఆర్డీఓలు వాసుచంద్ర, కృష్ణవేణి, డీఆర్డీఓ సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయండి



హెచ్‌ఎంలతో సమీక్షిస్తున్న రాధికాగుప్తా

విద్యారణ్యపురి: మార్చిలో జరగబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. పదోతరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో జిల్లాలో ఎక్కువమంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల నుంచి 23 మంది హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సూచనలిచ్చారు. ఇందులో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ రాధ, ఈక్విటీ కో–ఆర్డినేటర్ సునీత, ఏఎస్‌ఓ విజయకుమార్, ఎంఈఓలు రాంకిషన్ రాజు, రమాదేవి, వెంకటేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

9 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ కోర్సుల్లోని వివిధ సెమిస్టర్ల పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. 9 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరుగురు, ఖమ్మంలో ఇద్దరు, ఆదిలాబాద్ జిల్లాలో ఒకరు డీబార్ అయినట్లు వారు పేర్కొన్నారు.

'జెండా పాట' జోష్.. ఆ తర్వాత ఖల్లాస్

ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళన

- అత్యధిక ధర చెల్లించేది ఒకరిద్దరు రైతులకే..
- రేట్లు తగ్గించి దోపిడీ చేస్తున్నారని విమర్శలు
- ధర్నాతో తెరపైకి మోసం దందా
- మార్కెట్ అధికారులు చొరవ చూపాలంటున్న రైతులు



ఆందోళన చేస్తూ యార్డు నుంచి రోడ్డుపైకి వస్తున్న రైతులు



చర్చల అనంతరం ప్రారంభమైన కొనుగోళ్లు

సాక్షి, వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లకు సాగే జెండా పాట వినగానే రైతుల్లో ఒక్కసారిగా జోష్ వస్తోంది. ఆతర్వాత మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు మొదలయ్యాక అంతలోనే నిరాసక్తత కనిపిస్తోంది. సోమవారం జరిగిన జెండా పాటలో తేజ మిర్చి క్వింటాలుకు రూ.20,100లు పలకగా, దాదాపు అదే నాణ్యతతో ఉన్న మిర్చికి రూ.14 వేల నుంచి రూ.17వేలు, తక్కువ నాణ్యత ఉన్న మిర్చికి రూ.12వేల నుంచి రూ. 13 వేలు చెల్లిస్తామని చెప్పడంతో గొడవ మొదలైంది. ఏకంగా రూ.8వేల వరకు ధర తగ్గించడమేంటని రైతులు ఆగ్రహంతో మార్కెట్‌లోనే ఆందోళనకు దిగారు. అయితే ఈ తరహా దోపిడీ రోజూ జరుగుతున్న జెండా పాటకు కాస్త రూ.2 వేల నుంచి రూ.3 వేలు తక్కువగా ఉండడంతో గలాటా జరిగినా.. బయటకు వచ్చే సందర్భాలు చాలా తక్కువే. మిర్చి కొనుగోళ్ల ధరలో సోమవారం భారీ వ్యత్యాసాలు ఉండడంతో రైతులు ఆందోళన చేసే వరకు వెళ్లారు.

మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు	
తేజ న్యూ:	7,000
వండర్‌హాట్:	300
యూఎస్ 341 న్యూ:	400
ఎల్లో మిర్చి(తేజ):	30
తాలు:	800
మొత్తం:	8,530

వాళ్లు చెప్పిందే నాణ్యత..

వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ పంట ఉత్పత్తులు తీసుకొస్తున్నారు. ఇక్కడ తమ పంటకు ఎక్కువ ధర పలుకుతుందని వచ్చే రైతుల ఆశలపై వ్యాపారులు, అధికారులు నీళ్లు చల్లుతున్నారు. మార్కెట్‌లో మిర్చి ధరలను నిర్ణయించేందుకు ప్రతీరోజు మార్కెట్ అధికారుల పర్యవేక్షణలో రైతులు, అడ్తిదారులు, కొనుగోలుదారుల సమక్షంలో జెండా పాటను నిర్వహిస్తున్నారు. ఈపాటలో రైతులు తెచ్చిన సరుకు నాణ్యత పరిశీలించిన ట్రేడర్లు పాల్గొని ధరలు పెంచుతారు. ఫైనల్ ధరను ఆరోజు మార్కెట్‌లో ఆ రకం మిర్చి గరిష్ఠ ధరలను ప్రకటిస్తారు. ఆ తర్వాతనే పాట ఆధారంగానే కొనుగోళ్లు జరుగుతాయి. గరిష్ఠ ధర రైతులందరికీ చెల్లిస్తారా అంటే అదీ లేదు. ఒకరిద్దరు రైతులకు చెల్లించి మమః అనిపిస్తున్న ఘటనలే ఉంటున్నాయనే విమర్శలున్నాయి. అడ్తి వ్యాపారులు, ఖరీదుదారులు సిండికేట్‌గా మారి రైతులు తీసుకొచ్చిన పంట నాణ్యతను దృష్టిలో ఉంచుకోకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా ధర నిర్ణయిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

ఆందోళనతో దిగొచ్చారు..

మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు సుమారు నాలుగు గంటల పాటు నిలిచిపోయాయి. జెండా పాట కంటే రూ.8 వేలు తక్కువ చెల్లిస్తామని అడ్తిదారులు, కొనుగోలుదారులు చెప్పడంతో రైతులు విక్రయాలను నిలిపివేసి ధర్నా బాట పట్టారు. మార్కెటింగ్, పోలీసు అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతుల మధ్య రెండు గంటల పాటు చర్చలు జరిగాయి. చివరకు ప్రతీ లాట్ వద్దకు వచ్చి పరిశీలించి ధరలు నిర్ణయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు కాంటా వద్దకు వెళ్లారు. తేజకు క్వింటాకు రూ.16,500పైనే ధర చెల్లించారు. ఈ చర్చల్లో మార్కెట్ జేడీఎం మల్లేశం, డీఎంఓ ప్రసాదరావు, మామునూరు ఏసీపీ సతీశ్‌బాబు, కార్యదర్శి సంగయ్య, చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, సంపత్, ఏనుమాముల సీఐ మహేందర్, ఎస్ఐ రాజన్‌బాబు, గ్రేడ్–2 కార్యదర్శులు బియాబానీ, రాము పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం..



అడ్తిదారుడు, కొనుగోలుదారులతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధరల ఆధారంగా మార్కెట్‌లో కొనుగోళ్లు చేస్తారు. ధరలు తక్కువగా ఉంటే కోల్డ్ స్టోరేజీల్లో పెట్టుకుంటే వారికి రైతుబంధు కింద ఆర్నెళ్ల పాటు వడ్డీలేని రుణాలు అందిస్తాం.

-మల్లేశం, జేడీఎం (పర్సన్ ఇన్‌చార్జ్), వరంగల్

క్లుప్తంగా

డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ యథాతథం

- హైకోర్టు ఉత్తర్వులతో మరోసారి విచారించిన యాంటీ ర్యాగింగ్ కమిటీ
- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్

ఎంజీఎం : డాక్టర్ ప్రీతిని ర్యాగింగ్ చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన డాక్టర్ సైఫ్‌పై విధించిన సస్పెన్షన్‌ను పరిశీలించాలని హైకోర్టు ఆదేశాలతో మరోసారి విచారణ జరిపిన యాంటీ ర్యాగింగ్ కమిటీ అతని సస్పెన్షన్‌ను యథావిధిగా కొనసాగించేందుకు నిర్ణయం తీసుకుంది. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో అనస్తీషియా పీజీ రెండో సంవత్సరం అభ్యసిస్తున్న డాక్టర్ సైఫ్.. మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతిని మానసికంగా వేధించినట్లు యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారణకు వచ్చి ఏడాదిపాటు సస్పెన్షన్ విధించిన విషయం తెలిసిందే. డాక్టర్ సైఫ్ తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించి పునర్విచారణ చేయాలని కోరాడు. మరోసారి విచారణ చేయాలని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్‌ను హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డిసెంబర్ 9వ తేదీన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి డాక్టర్ సైఫ్‌ను అతని లాయర్ సమక్షంలో ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా సైఫ్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని యాంటీ ర్యాగింగ్ కమిటీ మరోమారు నిర్ధారించి అతనిపై విధించిన సంవత్సరం కాలం సస్పెన్షన్ కొనసాగుతుందని నిర్ణయించింది. కాగా కోర్టు ఆదేశాలతో సస్పెన్షన్ సమయంలో అతను హాజరైన 97 రోజుల కాలాన్ని పొడిగిస్తూ అతని సస్పెన్షన్‌ను ఈ ఏడాది జూన్ 8 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

కాశిబుగ్గ : రైలు కింద పడి ఓ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెక్కొండ రైల్వే స్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన సందబోయిన నాగరాజు(50) నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో పాయింట్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే కొన్ని రోజులుగా విధులకు అతను హాజరు కావడం లేదు. కారణాలు ఏంటో తెలియదు కానీ డౌన్ లూప్‌లైన్‌లో వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో శరీరం రెండు ముక్కలై అక్కడిక్కడే పడి మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి మృతుడి కుమారుడు యశ్వంత్‌కు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

మనస్తాపంతో మహిళ..


నాగమణి(ఫైల్)

మంగపేట : మండలంలోని రాజుపేటకు చెందిన వంగపండు నాగమణి(26) ఫైనాన్స్ కంపెనీ వాళ్లు ఇంటికి వచ్చి పొక్లెయినర్ తీసుకువెళ్లడంతో అవమానంగా భావించి మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బొబ్బిలి ప్రాంతానికి చెందిన వంగపండు సత్తిబాబు పొక్లెయినర్ డ్రైవర్‌గా ఉపాధికోసం ఐదేళ్ల క్రితం రాజుపేటకు వచ్చి అద్దె ఇంట్లో భార్య నాగమణితో ఉంటున్నాడు. గతేడాది ఫైనాన్స్‌లో పొక్లెయినర్ కొనుగోలు చేశాడు. కొంతకాలంగా నెలవారిగా చెల్లించాల్సిన కిస్తీలు చెల్లించక పోవడంతో ఫైనాన్స్ ఏజెంట్లు సోమవారం ఇంటికి వచ్చి బకాయి డబ్బులు చెల్లించలేదని తమ నిబంధనల మేరకు ముందుగా పొక్లెయినర్ తీసుకువెళ్తామని ఒత్తిడి చేశారు. ఎంత చెప్పినా వినకుండా పొక్లెయినర్ తీసుకువెళ్లడంతో అవమానంగా భావించిన సత్తిపండు భార్య నాగమణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త, ఐదేళ్ల కూతురు ఉంది.

ఫ్రెండ్ రిక్వెస్ట్.. తప్పదు మూల్యం

కొంపముంచుతున్నా.. కొత్త స్నేహాలు

- ఇంటర్‌నెట్ వాడకంలో అప్రమత్తత అవసరం
- నకిలీ ఖాతాలకు చోటివ్వొద్దు



➡ వరంగల్ నగరంలో బ్యూటిషియన్‌గా పనిచేస్తున్న వివాహితకు ఫేస్‌బుక్ ద్వారా ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఆ పరిచయమే చివరకు భర్తతో పాటు ఆమె మృతికి కారణమైంది. ఎంతో భవిష్యత్ ఉన్న రెండు జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి.

➡ ఓ యువకుడు ఏకంగా 80 నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను సృష్టించి పలువురు యువతులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఆఖరికి ఓ యువతి ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ఆకతాయి గుట్టురట్టయ్యింది.

కాజీపేట: సామాజిక మాధ్యమాలు.. కొత్త స్నేహాన్ని చిగురింపజేసే వేదికలు. మనకు తెలియని వ్యక్తులు స్నేహం చేసేందుకు(ఫ్రెండ్ రిక్వెస్ట్) అభ్యర్థనలు పంపుతుంటారు. అలా అని తొందరపడి యాక్సెప్ట్ చేశారో ఇరుకున పడే ప్రమాదముంది. అందుకే అపరిచితుల అభ్యర్థనలను సాధ్యమైనంత వరకు ఆమోదించకపోవడం మేలు. వారితో మనకు ముఖ పరిచయాలు లేకపోవడంతో ఒకటికి రెండుసార్లు వారి ప్రొఫైల్స్‌ను పరిశీలించి అభ్యర్థనను అంగీకరిస్తే మేలు.

అమ్మాయిల పేర్లతో..అబ్బాయిలు

సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమవుతున్న కొద్దీ అపరిచితులు తెలివి మీరుతున్నారు. కొందరు యువకులే అమ్మాయిల పేర్లతో ఏకంగా నకిలీ ఖాతాలను తెరుస్తున్నారు. చాటింగులో తియ్యగా మాట్లాడి క్రమంగా ప్రలోభానికి గురిచేస్తారు. ఈ విషయాన్ని వారు తొందరగా గుర్తించకపోతే బ్యాంకు ఖాతా, పిన్ నంబర్లు బయటకు చెప్పేలా చేస్తారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనలేని వారు మాత్రమే కాదు ప్రభుత్వ ఉద్యోగులు, చదువుకున్న వారు సైతం వీరి బారిన పడి ఆర్థికంగా మోసపోతున్నారు. కొత్తగా పరిచయమైన వారితో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను ఏ మాత్రం పంచుకోకూడదు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

మారుతున్న సాంకేతిక రంగంలో సామాజిక మాధ్యమాల హవా మితిమీరిపోతున్నాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్(ఎక్స్), ఇన్‌స్టా ఖాతాదారులే. వీటి ద్వారా మరుగున పడిన స్నేహబంధాలను పునరుద్ధరించడమే కాకుండా కొత్త వ్యక్తుల పరిచయానికి బీజం వేస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా అప్రమత్తంగా లేకపోతే అదే స్థాయిలో అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. దీంతో సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రతి ఐదు కుటుంబాల్లో నలుగురు ఇంటర్‌నెట్ వాడుతున్నారు. సుమారు 38లక్షల మందికిపైగా వివిధ రకాల ఇంటర్‌నెట్ ఉన్న సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. వీటి వాడకంలో యువత పాత్ర ప్రధానమైంది. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా వ్యవహరించే వారు 78శాతం, రోజూ కనీసం ఆరుసార్లు ఈ ఖాతాలను తెరిచి స్పందించే వారు 56 శాతం, కొత్త యాప్స్‌ను స్వాగతించే వారు 38శాతం మంది ఉన్నారని నిపుణుల అంచనా.

ఇంటర్ నుంచి పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న యువత 3 లక్షల మంది వరకు ఉంటారు. 16–30 ఏళ్ల వయసు కలిగిన యువత రోజుకు 2:15 గంటలపైనే సెల్‌ఫోన్ వాడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి.

అదో అద్భుతం.. వెంటనే దుర్భరం..

వాస్తవానికి ఇంటర్‌నెట్ ఓ అద్భుతం. అందులో జ్ఞానాన్ని గ్రహించిన వారికి బంగారు భవిష్యత్ దర్శనమిస్తుంది. కానీ ఇదే మళ్లీ చెడు ప్రభావానికి కారణమవుతుంది. స్వార్థానికి, వ్యసనాలకు వినియోగించే వారు అవస్థల పాలవుతున్నారు. మోసాలకు, అక్రమార్జనకు తెర లేపేవారు ఆలస్యంగా కటకటాలు లెక్కిస్తున్నారు. అవగాహన లేకుండా అమాయకంగా ఖాతా తెరిచి కొంతమంది విసిరే వలలో చిక్కి బలి పశువులవుతున్నారు.

గేమ్స్‌తో కామ్‌గా..

క్యాండీక్రష్, ఫార్మ్‌విల్లే తదితర ఆటల కోసం అభ్యర్థనలు అధికంగా వస్తుంటాయి. ఒకవేళ మీకు వారితో ఆడాలనిపిస్తే యాక్సెస్‌ను ఇచ్చేటప్పుడు మీ ప్రొఫైల్‌కు సంబంధించిన నియమాలు పాటించండి.ఆట పేరుతో పరిచయమైన వారికి అక్కడితో పరిమితం చేయాలి. మీ ఖాతా పాస్‌వర్డ్ ఎవరితోనూ పంచుకోకూడదు. ఎప్పటికప్పుడు పాస్‌వర్డ్ మారుస్తూ ఉండాలి. ఎక్కువగా సోషల్ మీడియాను వినియోగించే పిల్లలను తల్లిదండ్రులు అప్పుడప్పుడు కనిపెడుతూ ఉండాలి. ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తంగా ఉండాల్సిందే..



ఆధునిక కాలంలో ఇంటర్‌నెట్ అవసరమే. అయినా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.అవసరం మేరకే సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే అన్ని విధాలా మంచిది. గుర్తు తెలియని వారు ఫేస్‌బుక్ ఖాతాకు అభ్యర్థన పంపినా ఏ మాత్రం స్పందించను. పదే పదే అభ్యర్థనను తిరస్కరించడంతో విసుగు చెంది ఆ ప్రయత్నాన్ని వారే విరమించుకుంటారు.

– బండారి సురేందర్

స్వీయ నియంత్రణ అవసరం



“ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో వాట్సాప్, ఫేస్‌బుక్‌ల పాత్ర ఎక్కువైంది. విదేశాల్లో ఉన్న తల్లిదండ్రులు, స్నేహితులతో సందేశాల ద్వారా మాట్లాడుకునేందుకు పరిమితం చేయాలి. పనికిరాని కబుర్లు చెబుతూ విద్యార్థులు, మహిళలను ఆకర్షించేందుకు వీటిని వాడితే చర్యలు తప్పవు. అపరిచిత వ్యక్తుల పట్ల కఠినంగా ఉండాల్సిందే. లేదంటే మోసపోవడం ఖాయం. ఆ తర్వాత బాధపడిన ప్రయోజనం ఉండదు.

– డేవిడ్ రాజ్ (ఏసీపీ, కాజీపేట)

సీపీని కలిసిన ట్రైనీ ఐపీఎస్


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శుభం నాగ్

వరంగల్ క్రైం: శిక్షణ నిమిత్తం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన ట్రెయినీ ఐపీఎస్ అధికారి శుభం నాగ్ సోమవారం సీపీ అంబర్ కిషోర్ ఝూను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అంబర్ కిషోర్ ఝాకు ఆయన పుష్పగుచ్ఛం అందించారు. మహారాష్ట్రకు చెందిన ట్రెయినీ ఐపీఎస్ అధికారి శుభం నాగ్ ఆరునెలలు వివిధ హోదాల్లో పోలీస్ విభాగంలో పనిచేయనున్నారు. ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన 2022లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల తీరుతోపాటు ఇక్కడి స్థితిగతులపై సీపీ వివరించారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసిన ట్రెయినీ ఐపీఎస్

కరీమాబాద్ : వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను సోమవారం ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణలో భాగంగా వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన శుభం నాగ్ వారికి పుష్పగుచ్ఛం అందజేశారు.

కేయూ ఆడిట్ ఆఫీసర్‌గా శ్రీలత

కేయూ క్యాంపస్: కేయూలోని ప్రీ ఆడిట్ విభాగంలో ఆడిట్ ఆఫీసర్‌గా శ్రీలత నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆడిట్ ఆఫీసర్ అయిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో.. అతడిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అకౌంట్స్ విభాగంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతను నియమించారు. కాగా, అంతకుముందు పరీక్షల నియంత్రణ విభాగంలో డిగ్రీ సెక్షన్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామును నియమించారు. కానీ ఆయన విధుల్లో చేరేందుకు సుముఖత చూపలేదు. బిల్లుల విషయంలో తేడా ఉందని, అందుకే విముఖత చూపినట్లు తెలుస్తోంది.

బిల్ట్ పునరుద్ధరణపై సీఎం దృష్టి


హైదరాబాద్‌లో ఫిన్‌క్విస్ట్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఫిన్‌క్విస్ట్, ఐటీసీ సంస్థలతో సమీక్ష
- మంత్రి సీతక్క కృషి పట్ల హర్షం

మంగపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏజెన్సీకే తలమానికంగా నిలిచిన కమలాపురం బిల్ట్ కర్మాగారం 2014 నుంచి మూతపడిన విషయం విదితమే. బిల్ట్ సమస్యపై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఫ్యాక్టరీని పునరుద్ధరించే విషయంపై ఫిన్‌క్విస్ట్ సంస్థ, ఐటీసీ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఆయా కంపెనీల యజమాన్యం, ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎన్‌సీఎల్‌టీ నిబంధనల మేరకు రాష్ట్రంలో బిల్ట్ ఆస్తులను పొందిన ఫైనాన్సియల్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఫిన్‌క్విస్ట్) ఎండి హార్దిక్ పటేల్‌తో ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూతపడిన ఫ్యాక్టరీని సులభతరంగా పునరుద్ధరించానే బలమైన ఉద్దేశాన్ని సీఎం వ్యక్తం చేశారు. అదే విధంగా ఐటీసీ, పీఎస్‌పీడీ (పేపర్ బోర్డులు, స్పెషాలిటీ పేపర్స్ విభాగం)కు చెందిన సీఈఓ వాదిరాజ్ కులకర్ణితో తెలంగాణలో కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. బిల్ట్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఫిన్‌క్విస్ట్‌తో చర్చలు జరుపుతున్న ఐటీసీ కంపెనీకి కమలాపురంలో బిల్ట్ కర్మాగారం పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకరాలు అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(ఇండస్ట్రీస్) సింధు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క కృషి పట్ల హర్షం

వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు న్యాయం జరిగేందుకు అండగా నిలిచిన సీతక్క ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు చేస్తున్న కృషిపట్ల ఏజెన్సీ ప్రాంత ప్రజలు, నిరుద్యోగ యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే కార్మికుల రిలే నిరాహార దీక్ష

కాజీపేట రూరల్: రైల్వే కార్మికులకు ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కాజీపేట అన్ని బ్రాంచ్‌ల నాయకులు సోమవారం వేర్వేరుగా వేదికలు, టెంట్లు వేసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈదీక్షలు ఈనెల 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రిలేనిరాహార దీక్షలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు కాల్వ శ్రీనివాస్, సీహెచ్.శంకర్‌రావు, సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీపీఎస్‌ఈయూ జిల్లా జనరల్ సెక్రటరీ కొండ శ్రీనివాస్, స్టేట్ సెక్రటరీ ఎస్‌కె.అఫ్జల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఎల్ఆర్ఎం, టెక్నికల్, ఈఎల్ఎస్, ఇంజనీరింగ్, జనరల్ బ్రాంచ్‌ల నుంచి సంగ రమేష్, ఆర్.సమ్మయ్య రాజు, ఇబ్రహీం, నాయిని సదానందం, రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్‌యాదవ్, బాలమురి రాజు తదితరులు పాల్గొన్నారు.

హంగర్ ఫాస్ట్

కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అన్ని బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో రిలే హంగర్‌ఫాస్ట్ చేపట్టారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు చింత మురళి, ఎస్.వెంకటనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీ రజాలి పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల నుంచి ముస్తాక్, నర్సింగరావు, అభిలాశ్, జమ్మికుంట నుంచి నర్సింగరావు, కె.రవి, పాక రాజ్‌కుమార్, శంకర్ వరప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, యాకాంబ్రం, తిరుపతి, బల్వీందర్ పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు


రిలే హంగర్‌ఫాస్ట్‌లో ప్లకార్డులతో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

పింఛన్ ఇచ్చే వాళ్లకే ఓటేస్తాం..

కాశిబుగ్గ: పింఛన్ ఇచ్చే వాళ్లకే మా ఓటు అని మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు అన్నారు. ఏఐఆర్ఎఫ్ పిలుపు మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట కార్మికులు ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం దీక్ష చేపట్టిన కార్మికులకు మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు నిమ్మరసం అందజేసి విరమింపజేశారు. ఈ దీక్షలో మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి రవీందర్, బ్రాంచ్ కార్యదర్శి యుగేందర్, చైర్మన్ ముకుందం, సుధాకర్, బాబురావు, అహ్మద్, రామారావు, భిక్షపతి రమేశ్, రాజు, బాలాజీ, వర్మ, రాజేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- ప్రమాదంలో బాలిక మృతి
- పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన


పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు


బకాటి కీర్తన (ఫైల్)

వేలేరు : ట్రాక్టర్.. బైక్ ఢీకొని బాలిక మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ శ్రీధర్‌రావు, ఎస్సై డి.హరిత తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలంలోని దేవునూర్ గ్రామానికి చెందిన బకాటి రాజు బంధువుల ఇంటికి ఓ ఫంక్షన్ నిమిత్తం సిద్దిపేట జిల్లా అక్కన్నపేటకు ఆదివారం వెళ్లి సోమవారం సాయంత్రం తిరిగి వస్తున్నారు. ఇదే క్రమంలో కొన్నె సదానందం తన ట్రాక్టర్‌లో నారాయణగిరి నుంచి కంకర లోడ్‌తో వేలేరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో మూలమలుపు వద్దకు రాగానే గమనించని ట్రాక్టర్ డ్రైవర్ ఎదురుగా వస్తున్న బైక్ హ్యాండిల్‌కు ట్రాక్టర్ తగలడంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు ఎడమవైపు పడగా బాలిక బకాటి కీర్తన(10) ఎగిరి ట్రాక్టర్ ట్రాలీ టైర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అలాగే బంధువులు కూడా బాలిక మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. పోలీసులు ఇరువర్గాలను సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు.

మహిళా 'లా' గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- ఉమ్మడి వరంగల్‌జిల్లా బీసీ గురుకుల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలోని కాజీపేటలో గల మహాత్మా జ్యోతిరావు పూలే సంక్షేమ గురుకుల మహిళా లా(న్యాయ కళాశాల) కళాశాలలో 2023–2024 విద్యాసంవత్సరంలో ఐదేళ్ల లా, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ఈనెల 10వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ గురుకులాల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023 లాసెట్‌లో ఉత్తీర్ణులై.. ఇంటర్ పూర్తిచేసుకున్న మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లాసెట్ ప్రాసెసింగ్ ఫీజు రూ.800లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.500లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హత పత్రాలతోపాటు, కుల, ఆదాయ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు పొందినవారు గురుకులంలోనే ఉండాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్ల సమాచారం కోసం 99088 48929, 93966 00601, 98495 85458 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తమాషా చేస్తున్నారా?

- ఏఈఫై ఎస్ఈ ఆగ్రహం
- గండి పూడ్చివేయాలని ఆదేశం


గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ

హసన్‌పర్తి: 'తమాషా చేస్తున్నారా? విధులు సక్రమంగా నిర్వహించండి' అని వరంగల్ సర్కిల్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎస్సారెస్పీ కాల్వకు గండి' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి నీటి పారుదలశాఖ సర్కిల్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి స్పందించారు. ఈమేరకు సోమవారం గండి పడిన డీబీఎం–22/బీ ప్రాంతాన్ని సందర్శించారు. ఆయకట్టు రైతులతో మాట్లాడారు. ఏడాదిన్నర క్రితం గండి పడిందని, ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించలేదని రైతులు ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సారెస్పీ జలాలు విడుదలైనప్పుడు నీరు వృథాగా పోతోందని రైతులు తెలిపారు. దీంతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు అందడం లేదని ఎస్ఈకి చెప్పారు.

ఏఈపై ఆగ్రహం


ఈవిషయమై ఎస్ఈ సుధాకర్‌రెడ్డి స్థానిక ఏఈ భాస్కర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. నీళ్లు విడుదలైనప్పుడు కాల్వలు పర్యవేక్షిస్తున్నారా? ఏడాదిన్నర క్రితం గండి పడితే ఈవిషయాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. మరమ్మతులు చేశానని ఏఈ చెప్పడంతో గండి కొట్టిన వారిపై ఎందుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. ఈవిషయమై ఏఈ భాస్కర్‌రెడ్డి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

త్వరగా పనులు పూర్తి చేయండి

కాల్వకు ఏర్పడిన గండిని పూడ్చి వేయాలని ఎస్ఈ ఆదేశించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం తాత్కాలికంగా పనులు చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ సీతారాం నాయక్, డీఈఈ రవీందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. ఈనెల 19న పాఠశాల స్థాయిలో, 27న మండల స్థాయిలో, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, పరీక్షల కన్వీనర్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రతినిధులు పరికిపండ్ల వేణు, డాక్టర్ రాములు, ఉమామహేశ్వర్‌రావు, కనకాచారి, మురళీమోహన్, విద్యాదేవి, భిక్షపతి తదితరులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేవీవీ ప్రతినిధులు

పకడ్బందీగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయండి

మామునూరు: పకడ్బందీగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రజాపాలన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఈనెల 12 వరకు కంప్యూటరీకరణ పూర్తి కావాలన్నారు.


మేడారం డైవర్షన్ రోడ్ల పరిశీలన

- ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తుల కోసం రూట్ మ్యాప్‌ను ఐటీడీఏ పీఓ అంకిత్ పరిశీలించారు. సోమవారం మండలంలోని దొడ్ల, కొండాయి, ఊరట్టం వెళ్లే రోడ్లను అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఏటూరునాగారం మండలంలోని దొడ్ల నుంచి కొండాయి, మల్యాల మీదుగా వెళ్లే దారిలో ఉన్న జంపన్నవాగు తాత్కాలిక కాజ్‌వే, కొండాయి నుంచి ఊరట్టం వెళ్లే దారిలోని కొండ్రేడు కాజ్‌వేను పీఓ తనిఖీ చేశారు. తెలంగాణలోని ములుగు వైపు నుంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వైపు నుంచి అధిక సంఖ్యలో ప్రైవేట్ వాహనాలకు ఈ రోడ్డు ఉపయోగపడనుంది. అందుకోసం దొడ్ల, కొండాయి వంతెన వద్ద రోడ్డును మరింత పటిష్ఠ పర్చాలన్నారు.

ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

కరీమాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆరు గ్యారంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎలాంటి తప్పులు దొర్లకుండా క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, అధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

వరంగల్: వరంగల్– ఖమ్మం–నల్లగొండ గ్రాడ్యుయేట్ల నియోజకవర్గానికి సంబంధించి ఓటరు జాబితా తయారీ గురించి షెడ్యూల్‌ను నల్లగొండ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జారీ చేసినట్లు వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల కార్యాలయాల్లో వరంగల్–ఖమ్మం–నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు షెడ్యూల్ జారీ చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోగా ఓటర్లు ఫారం–18తో తమ దరఖాస్తులను దాఖలు చేసుకోవాలని కోరారు. వరంగల్ జిల్లాకు సంబంధించి వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లాలోని తహసీల్దార్ (ఏఈఆర్ఓ) కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు.